క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న నరేశ్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన నీలి రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కోంగ్ర నరేశ్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం చేశారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ నారాగౌడ్, గ్రామ అధ్యక్షుడు పోశెట్టి, మైసా ముత్తన్న, కిరణ్ ఠాకూర్, శేఖర్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

కూలీలకు పని కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నసిరొద్దీన్

తానూరు: ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పనులు పూర్తిచేయని కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో నసిరొద్దీన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి గ్రామాల్లో చేపట్టనున్న ఉపాధిహామీ పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జాబ్‌కార్డు లేని కూలీలకు జాబ్‌కార్డులు అందించి పనులు కల్పించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈజీఎస్ ఏపీవో శివలింగం, ఏఫ్ఏ గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం


తాండ్రలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మామడ: మండలంలోని తాండ్ర గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కృష్ణంరాజు, రామకృష్ణ, అనితలు సీజనల్ వ్యాధులు, నేత్ర సంబంధిత వ్యాధులు, స్త్రీ సంబంధిత సమస్యలను పరిక్షించి మందులు పంపిణీ చేశారు. ధూమపానం, గుట్కా, మద్యపానంకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు, ఎఫ్ఎస్‌వో శ్రీలతరెడ్డి, నర్సయ్య, సుధాకర్, ఉమమహేశ్వర్, లక్ష్మణ్ ఉన్నారు.

‘విష్ణుపూజకు తరలిరావాలి’

నిర్మల్‌టౌన్: నిర్మల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నిర్వహించే విష్ణు పూజ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ ఆలయంలో బుధవారం ఆవిష్కరించారు. పూజా కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వారసంత వేలం

ముధోల్: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వార సంత వేలం నిర్వహించనున్నట్లు బుధవారం పంచాయతీ కార్యదర్శి అన్వర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10.30 గంటల వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో రూ. 10వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో గెలిచిన వారు 24గంటలలో 50శాతం డబ్బులు చెల్లించాలని, పూర్తి వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

బహిరంగ వేలం వాయిదా

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించే ఇతరములు 2 కోసం ఆలయ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. వ్యాపారులు ముందుకు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. మళ్లీ త్వరలోనే వేలం నిర్వహిస్తామన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోదావరి బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో అశోక్ వర్మ హాజరై ఆమెను ఘనంగా సన్మానించారు.

ఆశాజనకంగా నువ్వు


పీచర వద్ద సాగవుతున్న నువ్వు పంట

- తక్కువ పెట్టుబడి –ఎక్కువ ఆదాయం
- జిల్లాలో 25వేల ఎకరాల్లో సాగు
- క్వింటాలుకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర

లక్ష్మణచాంద: జిల్లాలోని రైతులు వినూత్నంగా పంటలు సాగు చేస్తున్నారు. పురాతన పద్ధతుల్లో ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా విభిన్న రకాల పంటలు సాగు చేస్తున్నారు. తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల సాగుకు జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. స్వల్ప పెట్టుబడితో అతి తక్కువ శ్రమతో అధిక లాభాలు సాధించే పంటలలో నువ్వు పంట ఒకటిదిగా చెప్పొచ్చు. మంచి లాభాలు రావడానికి తోడు అన్నదాతల గృహావసరాలకు నూనె రావడంతో రైతులు నువ్వు పంట సాగుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

మూడో పంటగా సాగు..

వ్యవసాయ జిల్లాగా పేరున్న నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో పంటల సాగుకు నీటి వసతి ఉండటంతో మూడు పంటలు సాగు చేస్తున్నారు. వానాకాలంలో మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేసిన రైతులు పసుపు, మొక్కజొన్న పంటలు తీసిన అనంతరం రెండో పంటగా వేరుశనగ వేశారు. ఫిబ్రవరిలో వేరుశనగ తీసిన తరువాత ఇప్పుడు మూడో పంటగా ఎక్కువగా నువ్వు పంట సాగు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 25వేల ఎకరాలలో నువ్వు పంట సాగు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

బొంత పురుగు ఆశించే అవకాశం..

ప్రస్తుతం జిల్లాలో సాగు చేస్తున్న నువ్వు పంటకు వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల బొంత పురుగు తెగులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో నేలలో పగుళ్లు ఏర్పడి పగుళ్లలోకి వెళ్లిన పురుగు రాత్రి సమయంలో నేలపైకి వచ్చి ఆకులను తిని పంటకు నష్టం చేస్తుందని చెబుతున్నారు. దీని నివారణకు నోవాల్యూరాన్ 1 ఎంఎల్‌ను లీటర్ నీటికి కలిపి సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేయాలని తెలిపారు.

లాభాలపై ఆశ..

నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాలలో సాగవుతున్న నువ్వు పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఇప్పటి వరకు పంటకు ఎటువంటి తెగుళ్లు సోకలేదని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలోని పలు మండలాలలో ఈ యాసంగిలో అధిక దిగుబడులు ఇచ్చే రకం జగిత్యాల్ రీసెర్చ్ స్టేషన్ వారి జేసీఎస్ 1020 రకం సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ రకం నువ్వు రకం ఎకరానికి 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంటున్నారు. రైతులు గతంలో సాగు చేసే పాత రకం శ్వేత రకం ఎకరానికి కేవలం 2–3 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని కాని జేసీఎల్ 1020 రకం దానికి రెండింతల దిగుబడి వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో అన్నదాతలకు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి 5 –6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో క్వింటాలుకు రూ.10 వేల చొప్పున ఎకరానికి 5 –6 క్వింటాళ్లకు రూ.50వేల నుంచి రూ. 60 వేల ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట బాగుంది



మాది పీచర గ్రామం. ఈ యాసంగిలో మూడో పంటగా రెండు ఎకరాలలో నువ్వు పంట సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు పంటకు ఎటువంటి తెగులు లేకుండా ఆశాజనకంగా ఉంది.
– మల్లేశ్, యువరైతు

దిగుబడిపై ఆశ



మండల వ్యవసాయాధికారుల సూచనల మేరకు జేసీఎల్ 1020 రకం నువ్వు రెండు ఎకరాలలో సాగు చేస్తున్నాను. పంట బాగుంది. ఎకరానికి 5 నుంచ 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశలు పెట్టుకున్నాం.
– ముత్యం, యువరైతు

జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో ఈ యాసంగిలో 25వేల ఎకరాలలో నువ్వు పంట సాగవుతోంది. ఇప్పటి వరకు పంట బాగానే ఉంది. వాతావరణంలో మార్పులు వస్తుండటంతో బొంత పురుగు వచ్చే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయాధికారులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు.
– అంజిప్రసాద్, డీఏవో, నిర్మల్

నీటి ఎద్దడి లేకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజనర్సయ్య

లోకేశ్వరం: గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి (మత్స్య శాఖ అధికారి) రాజనర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి రాజనర్సయ్య మాట్లాడుతూ గ్రామాల్లో రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. నర్సరీల్లోని మొక్కలకు నీటిని ఎప్పటికప్పుడు తడులు అందించాలని పేర్కొన్నారు. ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని తెలిపారు. తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో వెంకటరమేశ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులు ఉన్నారు.

‘మహోర్ వరకు హైవే పొడిగించాలి’

భైంసాటౌన్: జిల్లాలో బాసర –భైంసా మీదుగా నిర్మిస్తున్న 161బీబీ జాతీయ రహదారిని మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహోర్ వరకు పొడిగించాలని భైంసా సిటిజన్ ఫోరం సభ్యులు ముష్కం రామకృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే రామారావు పటేల్ జాతీయ రహదారి పొడిగింపుపై ప్రభుత్వం దృష్టికి తేవడం అభినందనీయమన్నారు. మహారాష్ట్రలోని ప్రాచీన రేణుకామాత, దత్తాత్రేయ మందిరాలు కొలువైన మహోర్‌కు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తారన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్, బాసరల మీదుగా భైంసా వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిని మహోర్ వరకు పొడిగిస్తే భక్తులకు ప్రయోజనంతోపాటు భైంసా ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జాతీయ రహదారిని పొడిగించాలని కోరారు.

‘క్రీడలపై అభిమానంతోనే ఇండోర్ స్టేడియం’


మాట్లాడుతున్న అడ్వాల పద్మ

లక్ష్మణచాంద: క్రీడలపై అభిమానంతోనే మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మించామని తాజా మాజీ ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె నివాసంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ తీర్మానంతో మండల కేంద్రంలోని యువకులు, విద్యావంతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఇండోర్ షటిల్ కోర్టు నిర్మించామన్నారు. కొందరు తమ అనుచరుల కోసం నిర్మించారని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అనవసరపు ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

‘పద్మ మాటలు విడ్డూరం’


మాట్లాడుతున్న ఈటెల శ్రీనివాస్

లక్ష్మణచాంద: అవగాహన లేకుండా తాజా మాజీ ఎంపీపీ అడ్వాల పద్మ మాట్లాడుతున్నారని నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేసిన పనిని కప్పి పుచ్చుకోవడానికి స్కూల్ పిల్లలు, యువకుల కోసం షటిల్ కోర్టు నిర్మించానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కోర్టులో వారి అనుచరులు తప్పా స్కూలు పిల్లలు ఆడిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్నాల రాజేశ్వర్, మాజీ సర్పంచులు బిట్లింగ్ నారాయణ, ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకరి సురేశ్, గంగయ్య, రవి, సిరాజుద్దీన్, అస్గర్, రజనీకాంత్‌త్ గంగాధర్ గౌడ్, శ్రీకాంత్, భీమేశ్, సుభాశ్, భూమన్న, మల్లేశ్ ఉన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం శ్రీరామనవమి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అర్చకులు కీర్తి రాఘవశర్మ, ఉత్సవకమిటీ అధ్యక్షుడు గొండాల శ్రీనివాస్, సభ్యులు సుదర్శన్, సతీశ్‌రావు, లింగేశ్వర్, రాజశేఖర్, రవిచరణ్, శంకర్, సంతోష్, రాము, భీమేశ్వర్, చంద్రహాస్, చందు, వంశీ తదితరులు ఉన్నారు.

‘విజయయాత్ర’ విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఏప్రిల్ 1వ తేదీన పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో వీరహనుమాన్ విజయయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. వేదపండితులు వాసుదేవాచార్యులు, నాయకులు ప్రభాకర్, జితేందర్, సాంకేత్, రవీందర్, రాకేశ్, ఉదయ్, లోకేష్, రాజశేఖర్, ప్రతాప్, సాయి, ప్రణీత్, తరుణ్, యోగేశ్ తదితరులు ఉన్నారు.

ఇంటి పన్నుపై 90శాతం వడ్డీ రాయితీ

నిర్మల్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ కింద మార్చి 31 వరకు ఇంటి పన్ను పాత బకాయిలపై 90శాతం వడ్డీమాఫీ అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. లేకుంటే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తానూరు: వ్యవసాయ పనిముట్ల కోసం మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏవో మనీషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ 2024 –25 సంవత్సరానికి గాను తానూరు మండలానికి మొత్తం 21 వ్యవసాయ పనిముట్లు మంజూరైనట్లు తెలిపారు. జనరల్ కేటగిరికి 13, ఎస్సీ 4, ఎస్టీ 4 కేటాయించినట్లు తెలిపారు. వివరాలకు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్’

తానూరు: మండలంలోని హిప్నెల్లి, వడ్‌గాం గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటలకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల ు పుండలిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాసర: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో రూట్‌మ్యాప్‌ను ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీ కోకన్వీనర్. దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు.

ఇక్కడ వృధా.. అక్కడ వ్యథ


నచ్చన్‌ఎల్లాపూర్ సమీపంలో సాదర్‌మట్ కాలువ నుంచి వృధాగా పోతున్న నీరు


సాదర్‌మట్ కాలువ నీరందక కొత్తమద్దిపడగ శివారులో ఎండిన పొలం

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ, పెద్దూర్‌తండా తదితర గ్రామాలకు సాదర్‌మట్‌కాలువ ద్వారా సాగు నీరందక వరి పంటలు ఎండిపోతున్నాయి. ఇదే సాదర్‌మట్ కాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులు కడెం ప్రాజెక్టుకు ఫీడింగ్ చేసేందుకు విడుదల చేసిన నీళ్లు నచ్చన్‌ఎల్లాపూర్ శివారులో బీడు భూముల్లోకి వృధాగా పోతున్నాయి. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనంగా నిలుస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

పారాలీగల్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం


నివేదిక అందజేస్తున్న పారా లీగల్ వలంటీర్లు

నిర్మల్: వయసుతో నిమిత్తం లేకుండా జిల్లా పారా లీగల్ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, న్యాయమూర్తి రాధిక అన్నారు. ఇటీవల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ చేసిన ఆదేశాలతో 22మంది పారా లీగల్ వలంటీర్లు జిల్లాలోని 17 ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. సంబంధిత తనిఖీల నివేదికను బుధవారం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో న్యాయమూర్తికి అందించారు. ఆమె మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు చేసిన సూచనల ప్రకారం తనిఖీలు చేపట్టి నివేదిక అందించారన్నారు. నివేదికను ఐటీడీఏ పీవో, నిర్మల్ జిల్లా కలెక్టర్‌లకు పంపిస్తామని, ఈ వేసవి సెలవుల్లోనే ఆయా ఆశ్రమ పాఠశాలలో తగు చర్యలు తీసుకునేలా సూచిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసీ లింగన్న సహా పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి


పన్ను వసూళ్లను పర్యవేక్షిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో రత్నాకర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని మస్కాపూర్, సత్తనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ నెల 31వతేదీ వరకు గ్రామాల్లో 100శాతం పన్నులను వసూలు చేసేలా పంచాయతీ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్

కడెం: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం జీపీ కార్మికులకు గ్రీన్‌చానల్ ద్వారా జీతాలు చెల్లించాలని, జీపీ కార్మికులకు నష్టం కలిగిస్తున్న జీవో నం.51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేసి, పాత విధానం కొనసాగించాలన్నారు. జీపీ కార్మిక సంఘ మండల నాయకులు లక్ష్మణ్, రాములు, నర్సయ్య, రాజమౌళి, అశోక్ తదితరులు ఉన్నారు.

అడవిలో ఆగని కార్చిచ్చు


నచ్చన్‌ఎల్లాపూర్‌తండా వద్ద అంటుకున్న మంటలు

కడెం: అటవీశాఖ ముందస్తుగా రక్షణ చర్యలు తీసుకుంటున్నా అడవిలో కార్చిచ్చు ఆగడం లేదు. బుధవారం సాయంత్రం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌తండా సమీప అటవీ ప్రాంతంలో అగ్గిరాజుకుంది. మంటలు అంటుకుని గంటలు గడిచినా అటవీశాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు రాలేదు. దీంతో మంటలు అడవంతా వ్యాపిస్తున్నాయి.

స్త్రీనిధి రుణాల రికవరీలో చేతివాటం

దస్తురాబాద్: మండల కేంద్రంలోని మణికంఠ, సత్యసాయి గ్రామ స్వయం సహాయక సంఘాల సీసీలు స్త్రీనిధి రుణాల రికవరీలో చేతివాటం ప్రదర్శించినట్లు సీబీవో ఆడిటర్ దేవేందర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రుణాలు తీసుకున్న సభ్యుల ఇళ్లకు వెళ్లి ఆడిటింగ్ చేపట్టారు. మణికంఠ వీవోఏలో రూ. లక్ష 53వేల999, సత్యసాయి వీవోఏలో రూ. 61వేల561 అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. రుణాలు వసూలు చేసి సొంత అవసరాలకు సీసీలు వాడుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అవకతవకలకు పాల్పడిన సీసీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

రంజాన్‌కిట్లు పంపిణీ

బాసర: మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ మమ్మాయి రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం కార్యకర్తలకు, పేద కుటుంబాలకు రంజాన్ పండుగ పురస్కరించుకొని రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాసర పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్ దేశముఖ్, సీనియర్ నాయకులు సంజీవరావు దేశముఖ్, కాల్వ రాందాస్, ఫారూఖ్, సంతోష్, జలీల్, హుజుర్, గంగాప్రసాద్, మూస, ఫకీర్ అహ్మద్, అక్బర్ పాల్గొన్నారు.

హాస్టల్‌కు భవనం నిర్మించాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ నితిన్

కడెం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో–కన్వీనర్ నితిన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హాస్టల్‌ను సందర్శించి, సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో అరకొర సౌకర్యాలతో హాస్టల్ కొనసాగించడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఏడాది కాలంగా హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేదని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలన్నారు.